సాక్షి
తిరుపతి
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



స్వర్ణముఖి పరవళ్లు

శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతోంది. సుడులు తిరుగుతూ భక్తులను ఆకట్టుకుంటోంది.



అప్రమత్తంగా ఉండాలి

ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీడీసీఎల్ సాంకేతిక డైరెక్టర్ సుబ్బరాజు సిబ్బందిని ఆదేశించారు. - 8లో



ట్రాన్స్‌కోకు రూ.13 కోట్ల నష్టం

తుపాన్ కారణంగా ట్రాన్స్‌కోకు రూ.13 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 55,909 మంది స్వామివారిని దర్శించుకోగా 17,209 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మల్లిమడుగు గేట్లు ఎత్తివేత



రేణిగుంట: కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండింది. దీంతో అధికారులు 14 గేట్లు, 7 సిఫోన్ స్పిల్‌వేను తెరిచారు. 22వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు.

కొట్టుకుపోయిన చేప పిల్లలు



అరణియార్ గేట్ల నుంచి వస్తున్న వరద నీరు

పిచ్చాటూరు: భారీ వర్షాలకు అరణియార్ ప్రాజెక్టుకు ఉన్న 4 గేట్ల ద్వారా 16 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. గేట్ల ఎదుట ఉన్న పిచ్చాటూరు- శ్రీకాళహస్తి లోలెవల్ కాజ్‌వేపై నీటి ఉధృతి పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. అరణియార్ మత్స్యకేంద్రం నీటిలో మునిగిపోయింది. తొట్లలో పెంచుతున్న 10 లక్షల చేప పిల్లలు వరదనీటిలో కొట్టుకుపోయినట్టు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నరేంద్రబాబు తెలిపారు. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం నుంచి వర్షాలు నిలిచిపోవడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మునిగిన కాజ్‌వే

నాయుడుపేట టౌన్: భారీ వర్షాలకు సోమవారం రాత్రి నుంచి స్వర్ణముఖి నదికి వరద ఉధృతి పెరిగింది. స్వర్ణముఖి నది వద్ద ఉన్న కాజ్‌వే పై నుంచి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో నాయుడుపేట నుంచి వెంకటగిరి వైపు వాహనాల రాకపోకలు స్తంభించాయి. వాహనాలు ఓజిలి మండలం, కొత్తపల్లి మీదుగా మేనకూరు, వెంకటగిరి వైపు రాకపోకలు సాగిస్తున్నారు. తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపం వరకు వరదనీరు చేరింది. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో స్వర్ణముఖి కాజ్‌వే వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీస్‌శాఖ అప్రమత్తం



స్వర్ణముఖి నది వద్ద ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

వర్షాల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. మంగళవారం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి కాళంగి, స్వర్ణముఖి నదుల వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్వర్ణముఖి నది నాయుడుపేట పట్టణంలోని శివాలయం ముందు వరకు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే డయల్ 100, 112, లేదా 80999 99977 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ నరసింహారావు ఉన్నారు.

ఏర్పేడులో వరద బాధితులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



సైదాపురంలో వరద బాధితులకు ఆహారం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



వరి రైతులకు సూచనలిస్తున్న డీఏఓ ప్రసాద్‌రావు



పరామర్శిస్తూ.. భరోసానిస్తూ..



చిల్లకూరు: మట్టిలో కూరుకుపోయిన బోటును బయటకు తీస్తూ..

జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నేతలు, అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వర్ష బాధితులను పరామర్శిస్తూ.. సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో అందుతున్న వసతులపై ఆరా తీస్తున్నారు. ముంపునకు గురికాకుండా ఉండేందుకు శాశ్వత ప్రణాళికపై దృష్టి సారిస్తున్నారు. దెబ్బతిన్న ఇళ్లు, పంటలకు నష్టపరిహారం అందేలా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రాణనష్టాన్ని అరికడుతున్నారు.

- తగ్గిన తుపాన్ ప్రభావం
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన నేతలు
- జిల్లాలో నిండుకుండల్లా జలాశయాలు

తిరుపతి అర్బన్ / తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా యంత్రాంగం, నేతలు సమష్టిగా సహాయక చర్యలు ముమ్మరం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎక్కడా ప్రాణనష్టం కలగకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,250 చెరువులు నిండడంతో చెరువుల కరకట్టలు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తున్నారు.



తిరుపతి గొల్లవాని గుంటలో మోకాటిలోతు నీళ్లల్లో వెళ్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

నేనున్నానని.. మీకేం కాదని

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలోని వరదప్రభావిత ప్రాంతాల్లో టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ ఇతర అధికారులతో కలిసి కొరమేనుగుంట, పూలవానిగుంట ప్రాంతాల్లో కలియతిరిగారు. మోకాటిలోతు వరదనీటిలో నడుచుకుంటూ వెళ్లి వరదబాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద కాలువల్లో పూడిక తీయడం, కాలువలను ఆధునీకరించడం, కొత్త కాలువలు నిర్మించడం వల్ల తిరుపతి నగర ప్రజలకు వరద ముంపు లేదన్నారు. మరీ లోతట్టు ప్రాంతాల్లో మినహా వరద నీటి ఉధృతి చాలా వరకు అరికట్టినట్టు తెలిపారు. వర్ష బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వివరించారు. పూలవానిగుంట, గొల్లవానిగుంట ప్రాంతాల్లోని వారిని పరామర్శించారు. ఏ అవసరమొచ్చినా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వరద నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ హరిత, తహసీల్దార్ వెంకటరమణకు సూచించారు. వరద బాధితులకు సాయం అందించేలా కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ ఉమా అజయ్, ఎస్.ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, ఆర్‌ఐ రామచంద్ర, నాయకులు అజయ్‌కుమార్, దూది శివ, తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

పంట నష్టంపై ఆరా

నష్టపోయిన పంటలపై వ్యవసాయశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. వరి పంట 17 వేల ఎకరాలు నీటమునిగినట్లు అంచనా వేశారు. ఉద్యాన పంటల్లో మిరప, అరటి, బొప్పాయి పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్లు అంచనాకు వచ్చారు.

తక్షణ సాయం..సంతృప్తికరం

50 గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావు పరిశీలించారు. బాధితులకు అందుతున్న వసతిపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాలను వీడే సమయంలో ఒక వ్యక్తికి రూ.1000, కుటుంబానికి రూ.2,500 చొప్పున అందించనున్నారు. అదేవిధంగా వర్షానికి దెబ్బతిన్న ఇంటికి తక్షణ సాయం కింద రూ.10 వేలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నారు.

బ్యాంక్ మిద్దెక్కి.. ప్రాణాలతో బయటపడి



వాచ్‌మన్, ఆయన భార్యను సురక్షితంగా తీసుకొస్తున్న ఆర్డీవో, పోలీసులు, సిబ్బంది

వాకాడు: స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం రాత్రి వాకాడు మండలం బాలిరెడ్డి పాళెం వద్ద కరకట్టకు గండిపడింది. దీంతో సమీపంలోని యూనియన్ బ్యాంకు మునిగిపోయింది. ఆ సమయంలో బ్యాంకులో కాపలాగా ఉన్న వాచ్‌మన్ వెంకటనరసయ్య, ఆయన భార్య సుగుణమ్మ బ్యాంకు మిద్దెపైకి ఎక్కారు. దాదాపు 24 గంటలు వారు అక్కడే గడిపారు. వారిని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, వాకాడు సీఐ హరికృష్ణ, అగ్నిమాపక శాఖ, రక్షణ బృందాలతో బోట్‌లో అక్కడి వెళ్లి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

వాగును దాటిస్తూ.. ప్రాణాలు రక్షిస్తూ..

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లిలో వాగులో చిక్కుకున్న ఇద్దరు రైతులను అధికారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. బండారుపల్లి గ్రామానికి చెందిన రైతులు నలదమ్మ శివ(22), ఎస్.వెంకటేష్(23) సోమవారం సాయంత్రం సున్నపువాగులో కొద్దిగా ప్రవహిస్తున్న నీటిలో దిగి అవతలివైపున ఉన్న వారి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లారు. ఆ తర్వాత వాగును దాటలేకపోయారు. తమ వద్ద ఉన్న ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తక్షణం స్పందించారు. ఏర్పేడు సీఐ శ్రీహరిని అప్రమత్తం చేశారు. మంగళవారం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వాగుకు అవతలి వైపున ఉన్న రైతులను సురక్షితంగా రక్షించి ఒడ్డుకు చేర్చారు.



రైతులను ఒడ్డుకు చేర్చుతున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కున చేర్చుకుంటూ..అండగా నిలుస్తూ..



బాధితులకు ఆహారం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తుపాన్ వల్ల ఏ ఇబ్బంది ఉన్నా బాధితులు తనను సంప్రదించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని 33వ వార్డు పరిధిలోని ప్రాజెక్టువీధి, ఎస్టీకాలనీ లోతట్టు ప్రాంతాల ప్రజలను మంగళవారం ఆయన పరామర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి మూడు పూట్లా భోజన వసతి కల్పించారు. అకాల వర్షం వల్ల నష్టపోయిన ఇళ్లకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం త్వరలోనే అందజేస్తామన్నారు. అలాగే ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే తనకు ఫోన్ ద్వారా సమాచారం తెలపాలన్నారు.

పర్యవేక్షిస్తూ.. ఆపన్న హస్తం అందిస్తూ..



వర్షబాధితులతో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి మంగళం: తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. తిరుపతి అర్బన్ మండలం, మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని కేవీఆర్ నగర్ ముంపునకు గురికావడంతో మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పార్టీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. వరద ఉధృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రజలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

కన్నీళ్లు తుడుస్తూ..కష్టాలు తీర్చుతూ..



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నియోజవర్గంలో ముంపునకు గురైన పలు ప్రాంతాలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పర్యటించారు. చిలమత్తూరులో ముంపు బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామంలో వరద నీట మునిగిన వరి, పడిపోయిన అరటి చెట్లు తదితర వాటిని పరిశీలించారు. తుమ్మూరు టీటీడీ కల్యాణ మండపం సమీపంలో స్వర్ణముఖి నది కలుజు నుంచి వరద నీరు చేరి ముంపునకు గురైన ఇళ్ల వద్దకు చేరుకుని బాధితలను పరామర్శించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

గంగమ్మా..దీవించమ్మా

- ఏడు గంగమ్మలకు ముక్కంటి సారె
- కాళ్లు కడిగి ఆత్మీయంగా ఆహ్వానించిన స్థానికులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాయం తరఫున సారె సమర్పించారు. ఆలయ అలంకారమండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మండపం వద్ద సారెను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలోని పాతాళ గణపతి ఆలయం వద్ద వాహన మండపం ద్వారా ఊరేగింపుగా బయటకు వచ్చి గాలిగోపురం, తేరువీధి, బియ్యపు కృష్ణారెడ్డి మండపం, పెండ్లిమండపం, ముత్యాలమ్మగుడివీధి మీదుగా ఏడుగంగమ్మల గుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు సారె సమర్పించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సతీమణి శ్రీవాణిరెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాదాలు కడిగి స్వాగతం పలికారు. అనంతరం ఏడుగంగమ్మల గుడి వద్ద సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడు గంగమ్మలను ప్రతిష్ఠించి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఈవో కేఎస్.రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.





సారె తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

అప్రమత్తంగా ఉండాలి

ఏర్పేడు: వర్షాకాలం ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఎస్పీడీసీఎల్ సాంకేతిక డైరెక్టర్ సుబ్బరాజు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఏర్పేడు ఎస్పీడీసీఎల్ ఉ ప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు లు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ తిరుపతి చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా ×సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళలు¥ అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ వీసీ భారతి హాజరై, ప్రసంగించారు. రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ ఎం భూపతి, ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ భూపతి, డాక్టర్ చెంద్రాయుడు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ కె పూర్ణచంద్రరావు, ప్రొఫెసర్ పి జోత్స్న, ప్రొఫెసర్ ఆర్ జయమాధురి, ప్రొఫెసర్ బి కిశోరి, డాక్టర్ జి శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

8న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 170 ఉద్యోగాలకు మూడు ప్రముఖ ఎమ్ఎన్సీ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10గంటలకు వర్సిటీ ఆవరణలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరగనున్న జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధే ఎజెండా

- దేశంలోనే అగ్రగామి సిటీగా తిరుపతిని నిలబెడతాం
- ఓటు బ్యాంకు రాజకీయం కాదు.. అభివృద్ధిపైనే దృష్టి
- సిటీ బ్రాండ్ ఇమేజ్‌తోనే ఐటీ కంపెనీలు మొగ్గు
- బాలాజీ రిజర్వాయర్‌తోనే నీటి ఎద్దడిని అరికట్టగలం
- మీడియా చిట్‌చాట్‌లో డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి


మీడియా చిట్‌చాట్‌లో డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ: అభివృద్ధే ఏజెండా అని, దేశంలో అగ్రగామి సిటీగా తిరుపతికి గుర్తింపు తేవాలన్నదే తమ ప్రయత్నమని తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో ఆయన మీడియా మిత్రులతో చిట్‌చాట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులు సంధించిన ప్రశ్నలకు ఆయన సావధానంగా సమాధానమిచ్చారు. డిప్యూటీ మేయర్‌గా అవకాశం వచ్చిన వెంటనే తిరుపతి అభివృద్ధిపై దృష్టి సారించానన్నారు. అనే కఠిన నిర్ణయాలతో 18 మాస్టర్ ప్లాన్‌రోడ్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. సీసీరోడ్లు, డ్రైనేజ్ కాలువల నిర్వహణ పక్కాగా అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. గొల్లవానికుంట, లెనిన్ నగర్, లీలామహల్ వంటి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజ్ కాలువలు బ్లాక్ కావడంతో వర్షపు నీరు నిలుస్తోందని, త్వరలో ఆ సమస్యకు కూడా పూర్తిగా పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రధానంగా తన దృష్టి శానిటేషన్‌పై ఉందని, సిబ్బంది కొరత వాస్తమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీకుకెళ్లామన్నారు. భక్తులు తిరుపతి నుంచే తిరుమలకు వెళ్తారని, అందుచేతనే టీటీడీని తిరుపతి అభివృద్ధికి ఒక శాతం నిధులు ఇచ్చి సహరించమని అడిగామన్నారు. నగరానికి ప్రస్తుతం కై లాసగిరి నుంచి తెలుగుగంగ నీరు 70శాతం, కళ్యాణి డ్యామ్ నుంచి 30శాతం నీరు అందుతోందన్నారు. ఒక పైప్‌లైన్‌లో మాత్రమే నీళ్లు వస్తున్నాయని, రెండో పైప్‌లైన్ పనులు 33 కి.మీ వరకు జరిగాయన్నారు. మిగిలిన పనులకు రూ.40కోట్లు అవసరమవగా టీటీడీ త్వరలో నిధులు విడుదల చేస్తే ఆ పనులు కూడా పూర్తిచేస్తామన్నారు. బాలాజీ రిజర్వాయర్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తేనే తిరుపతి నీటి ఎద్దడిని అరకట్టగలమన్నారు. టీటీడీ భాగస్వామ్యంతో వచ్చే ఆరు నెలల్లోనే దీనిపై దృష్టి పెడతామని తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న సుమారు ఐదు వేల కుటుంబాలకు మేలు చేశామని తెలిపారు.

యువతకు ఉద్యోగాలు

శెట్టిపల్లె భూముల నుంచి నగరపాలక సంస్థకు వచ్చే 110 ఎకరాల భూమిని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నట్టు భూమన అభినయ్ వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఐటీ సంస్థలను నెలకొల్పి భవిష్యత్‌లో యువత ఉద్యోగాల కోసం చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు వలస వెళ్లకుండా తిరుపతి వాసులు ఇక్కడే ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేలా చర్యలు చేపడుతామన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్, సిటీ బ్రాండ్ ఇమేజ్ ఉంటే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు తిరుపతిపై దృష్టి సారిస్తాయన్నారు. తిరుపతిని క్రైం ఫ్రీ సిటీగా గుర్తింపు తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అనంతరం తిరుపతి జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య తీర్చాలని కోరగా ఈ నెల 14న ఈ సమస్యపై పూర్తి స్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 175 గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం

రేణిగుంట: రేణిగుంట అర్బన్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 175 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆ వివరాలను విలేకరులకు వివరించారు. పట్టణంలోని పాంచాలి నగర్, వెదుళ్లచెరువు, అన్నాసామిపల్లిల్లోని ఇళ్లల్లో జరిగిన చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా నిందితులను రేణిగుంట రమణవిలాస్ సర్కిల్ వద్ద సోమవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. నిందితులు తమిళనాడు రాష్ట్రం తేనె, దిండిగళ్ ప్రాంతాలకు చెందిన ఎం.గురునాథం(37), ఏ.పాలిస్వామి(70), ఎం.మయాకాళై(57), ఏ.కరుణానిధి(55)గా గుర్తించినట్లు వివరించారు. వారి వద్ద ఉన్న 175 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తాళాలు వేసిన ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడేవారన్నారు. వీరిపై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట-పలమనేరు మార్గంలోని దాసనంపల్లె బస్‌స్టాప్ వద్ద సోమవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. దాసనంపల్లెకు ఆలేటి రామకృష్ణ(55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పని ముగించుకుని స్వగ్రామానికి నడిచి వెళుతుండగా నడింపల్లె గ్రామానికి వెళుతున్న దిలీప్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో వేగంగా ఢీ కొన్నాడు. క్షతగాత్రుడిని వెంటనే పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

జిల్లా స్పోర్ట్స్ అధికారి నియామకంపై హర్షం


షేక్ సయ్యద్‌ను సత్కరిస్తున్న ఒలిపింక్ అసోసియేషన్ నేతలు, శాప్ శిక్షకులు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల ముఖ్య క్రీడాశిక్షకుడిగా, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిపాలనాధికారిగా అనేక ఏళ్లు ఉత్తమ సేవలందించిన షేక్ సయ్యద్ సాహెబ్ నియామకం అభినందనీయమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షేక్ సయ్యద్ సాహెబ్‌ను ఘనంగా సత్కరించారు. సత్కరించినవారిలో ఒలిపింక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి జీఎస్.సాయికుమార్, జిల్లా శాప్ శిక్షకులు ఆదినారాయణ, హిందూజ, సాయి సుమతి, నీలిమ, విజయమోహన్‌రెడ్డి, సూర్యకళ ఉన్నారు.

యువతలో ప్రతిభ వెలికితీతకే 'ఆడుదాం ఆంధ్రా'

- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలోని పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ప్రతిభను వెలికితీసి వారికి బంగారు భవిష్యత్‌ను అందించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ×ఆడుదాం ఆంధ్రా । క్రీడలను నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించిన బ్రోచర్, ట్రోఫీలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల యువతీ యువకులు క్రీడలలో పాల్గొని, వారి ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షేక్ సయ్యద్ సాహెబ్, కోచ్‌లు గోపి, వినోద్, హిందుజా, యహజాజ్ పాల్గొన్నారు.

నేడు యూ-14, 17 ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి చిత్తూరు అండర్-14, 17 బాలబాలికల ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయి. ఆ మేరకు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.సాయిదిలీప్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో 2010 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు, అండర్-17 విభాగంలో 2007 జనవరి ఒకటి నుంచి 2010 నవంబర్ 30వ తేదీ మధ్యలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన వారు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాచే జారీ చేసిన ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలని, అలాగే ఆధార్, బర్త్ సర్టిఫికెట్, వ్యక్తిగత ఫెన్సింగ్ సామగ్రితో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91006 40712, 95731 44231నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు మల్లికార్జున, భారతి మీడియాకు వివరాలు వెల్లడించారు. స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపు గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమ వారం మధ్యాహ్నం ఎస్ఐ మల్లికార్జున తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వినాయకపురానికి చెందిన రిజ్వాన్, సాకార్‌పేటకు చెందిన అన్సర్ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన జానకారపల్లెకు చెందిన రహంతుల్లాను సైతం అరెస్ట్ చేసి మరో 4 కిలోల గంజాయి సీజ్ చేశారు. రహంతుల్లాకు గంజాయి విక్రయించిన మహిళ కోసం గాలింపు చేపట్టారు. ముగ్గురు నిందితుల నుంచి మొత్తం రూ.3లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుత్తూరు: పట్టపగలే ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు .. పరమేశ్వరమంగళం గ్రామంలోని నాగరత్నమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి ఈ నెల 2వ తేదీ సాయంత్రం ఓ దుండగుడు చొరబడి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి భర్త మునస్వామినాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్.రంజిత్‌రావు(22) అనే ఎల్ఎల్‌బీ విద్యార్థే నిందితుడిగా గుర్తించారు. సోమవారం సాయంత్రం వేపగుంట క్రాస్ వద్ద నిందితుడు బస్సు ఎక్కుతుండగా అదుపులోకి తీసుకున్నారు. రూ.1.20 లక్షలు విలువ చేసే బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తమిళనాడుకు చెందిన అరియలూరు జిల్లా, కులత్తూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. పరమేశ్వరమంగళంలోని కేకేసీ కళాశాలలో ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఇలా దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడించాడు.

వాగులో పడి బాలుడి గల్లంతు


వాగులో కొట్టుకుపోయిన బాలుడు నిఖిల్

తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ మండలం, మంగళం సమీపంలో సీఎస్ఎన్.మహాలక్ష్మి గార్డెన్స్ సమీపంలోని వాగులో పడి నిఖిల్ (10) గల్లంతయ్యాడు. బాలుడి బంధువుల కథనం మేరకు వివరాలు.. తిరుపతి నగర పరిధి జీవకోనలోని సంతోషమ్మనగర్‌కి చెందిన కె.ఆనంద్, చిట్టి కుమారుడు నిఖిల్. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చేపలకోసమని మేనమామ ప్రభాకర్‌రెడ్డి, తాత, అతని స్నేహితులతో కలిసి మంగళం నుంచి అన్నాసామిపల్లెకు వెళ్లే మార్గంలో ప్రవహిస్తున్న వాగు వద్దకు చేరుకున్నారు. వాగులో నీటి వేగం ఎక్కువగా ఉండడంతో పిల్లలను వాగుకు దూరంగా ఉండాల్సిందిగా అక్కడున్నవారు సూచించారు. అయితే నిఖిల్ మాత్రం గట్టుపైకి వెళ్లినట్టేవెళ్లి తిరిగి వాగులోకి వెళ్లి కొట్టుకుపోయాడు. అయితే ఈ విషయం అతని బంధువులు ఎవ్వరూ గమనించలేదు. కొంత సమయానికి ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నింగా బాలుడు కనిపించలేదు. సమీపంలో చేపలు పడుతున్న కొందరు.. ఎవరో చిన్నపిల్లవాడు నీటిలో కొట్టుకుపోతున్నాడని చెప్పారు. వెంటనే అప్రమత్తమైన బంధువులు, చేపలు పడుతున్న వారు వాగుపొడవునా గాలించారు. అయినా బాలుడి జాడ కనిపించలేదు. ఈ మేరకు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ జగన్నాథరెడ్డి స్థానికులతో కలిసి రాత్రి పొద్దుపోయేవరకు గాలించారు. ఇదిలా ఉండగా బాలుడి తల్లితండ్రులు, బంధువులు బిడ్డకోసం తల్లడిల్లిపోయారు. గుండెలు పగిలేలా బోరున విలపించారు.

చిట్టమూరులో 278.2 మి.మీ వర్షం


సూళ్లూరుపేట సమీపంలో కాళంగినది ఉగ్రరూపం


సూళ్లూరుపేట వద్ద వరదనీటిలో మునిగిపోయిన పడమటకండ్రిగ పంటపొలాలు

తిరుపతి అర్బన్: జిల్లాలో మంగళవారం ఉదయం చిట్టమూరులో అత్యధికంగా 278.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు 940.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 1,025.9 మి.మీ వర్షపాతం నమోదైనట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావుకు వివరించారు.

కలిచేడు చెరువుకు గండి

సైదాపురం: సైదాపురం సమీపంలో కైవల్యా, కమాంన్ నీటి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం-గూడూరు మార్గంలో రాకపోకలు స్తంభించారు. అలాగే తురిమెర్ల వద్ద పిన్నేరు, ఊటుకూరు వద్ద ఉన్న మాలేరు, శమాయిన్ వద్ద ఉన్న సిద్ధల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం- పొదలకూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాల య సబ్‌స్టేషన్ వద్ద ఉన్న చెట్లు నేలకొరిగాయి. కలిచేడు చెరువుకు గండి పడడంతో నీరు వృథాగా పోయింది. వేమనచేడు, పాలూరు, అనంతమడుగు, వెంకటరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, రామసాగరంలోని పంట పొలాలు నీటమునిగాయి. సుమారు 25 ఎకరాల్లో బొప్పాయి నీటమునిగింది. నిమ్మచెట్లు దెబ్బతిన్నాయి. 150 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 20 ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్‌శాఖకు సుమారు రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సైదాపురం మండలంలో ఏర్పాటు చేసిన 8 పునరావస కేంద్రాల్లో బాధితులకు తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు ఆహారం అందించారు.


ఉధృతంగా కమాండ్‌గెని


నీటమునిగిన చవక పంట

అరణియార్ ఎడమ కాలువ అక్విడెక్‌కు గండి

పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ ఎడమ కాలువ అక్విడెక్‌కు గండి పడింది. దీంతో కాలువ గుండా ప్రవహించాల్సిన నీరు అరుణానదిలో కలిసిపోతోంది. రెప్పాలపట్టు నుంచి అడవికండ్రిగ గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. అడవికండ్రిగ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అరణియార్ గేట్లను పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావు పరిశీలించారు. ఆయనతోపాటు సీఐ కె.లక్ష్మీనారాయణ ఉన్నారు. ఇదిలావుండగా మంగళవారం సాయంత్రానికి వరద నీరు తగ్గడంతో అరణియార్ గేట్ల ద్వారా విడుదల చేసే నీటిని 2 వేలుకు తగ్గించారు. పిచ్చాటూరు-శ్రీకాళహస్తి మధ్య రాకపోకలకు అనుమతించారు.

కాళంగి ఉగ్రరూపం

కేవీబీపురం : మండలంలోని కాళంగి రిజర్వాయర్‌కు వరదనీరు భారీగా చేరింది. ప్రస్తుతం 44,000 క్యూసెక్కుల నీరు డ్యామ్‌కు చేరుతోంది. దీంతో 10 మినీ గేట్లు, మూడు ప్రధాన గేట్లను ఎనిమిది అడుగుల మెరా ఎత్తి 40,000 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన గేట్లను ఎత్తివేయడంతో జయలక్ష్మీపురం, అంజూరుపాళెం గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరో 15 రోజుల పాటు చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి.


కాళంగి రిజర్వాయర్ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ట్రాన్స్‌కోకు రూ.13 కోట్ల నష్టం


నాయుడుపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని ఆయా ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ల నుంచి 360 మంది విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు నెల్లూరు సర్కిల్‌కు చేరుకున్నాయని వివరించారు. భారీ వర్షాల కారణంగా సంస్థ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని 6 పట్టణాలకు, 1,119 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. సంస్థ పరిధిలో 33 కెవి సబ్ స్టేషన్లు 305, 33కెవి ఫీడర్లు 184, 11కెవి ఫీడర్లు 1220 మరమ్మతుకు గురయ్యాయని, 33కెవి విద్యుత్ స్తంభాలు 835, 11కెవి విద్యుత్ స్తంభాలు 3,272, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 2,290, 69కి.మీ. మేర 33కెవి లైను, 206 కి.మీ.మేర 11కెవి లైను, 123కి.మీ. మేర ఎల్‌టీ లైను, 1 పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 1,268 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతినడం ద్వారా 11.52 లక్షల విద్యుత్ సర్వీసులు, 1.56 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. తద్వారా సంస్థకు సుమారు రూ.13 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడిన సర్వీసుల్లో మంగళవారం సాయంత్రానికి 1.81 లక్షల విద్యుత్ సర్వీసులు, 5,425 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. ఎక్కడైనా అత్యవసరమైతే టోల్ ఫ్రీ నంబర్లు-1912 లేదా 1800425155333 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సంస్థ వాట్సాప్ నంబరు 91333 31912కు తెలియజేయాలని సూచించారు.